ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
16 జనవరి
2025



# యాదగిరిగుట్టలో అధ్యయనోత్సవాలు పరిసమాప్తి

**ఈ నెల 10 నుండి 15 వరకు ఘనంగా జరిగిన అధ్యయనోత్సవాలు**

**చివరిరోజు లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో భక్తులను అలరించిన స్వామివారు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న అధ్యయనోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నిర్వహించిన లక్ష్మీనరసింహస్వామి అలంకార సేవతో అధ్యయనోత్సవాలకు అర్చకులు పరిసమాప్తి పలికారు. ఈ నెల 10న మొదలైన అధ్యయనోత్సవాలు.. 15 వరకు ఆరు రోజుల పాటు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా అర్చకులు ఈ నెల 10 నుండి రోజుకు రెండు అవతారాల్లో స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇక చివరిరోజైన బుధవారం చేపట్టిన శ్రీలక్ష్మీనరసింహస్వామి అలంకార సేవతో అధ్యయనోత్సవాలకు ముగింపు పలికారు. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఉదయం స్వామివారిని లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో ముస్తాబు చేసి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి నిత్యారాధనలు ముగిసిన అనంతరం.. స్వామివారిని రకరకాల పూలు, వజ్ర వైఢూర్యాలు, బంగారు ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం స్వామివారి అలంకార సేవను ప్రధానాలయ తిరువీధుల్లో విహరింపజేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ప్రత్యేక వేదికపై స్వామివారి సేవను అధిష్టింపజేసిన అర్చకులు.. శ్రీలక్ష్మీనరసింహస్వామి అవతార విశిష్టతను భక్తులకు ప్రవచించారు. యాదరుషి కఠోర తపస్సుకు ప్రసన్నుడైన నారసింహుడు.. యాదగిరిగుట్ట క్షేత్రంలో పంచరూపాలలో వెలిశారని భక్తులకు ప్రవచించారు. ఇక బుధవారంతో అధ్యయనోత్సవాలు ముగియడంతో.. ఈ నెల 10 నుండి రద్దు చేయబడిన ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం వంటి నిత్య కైంకర్యాలు గురువారం నుండి తిరిగి పునరుద్ధరణ కానున్నాయి.

**ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు**

యాదగిరిగుట్టలో గత నెల రోజులుగా జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం చేపట్టిన 'ఒడి బియ్యం' కార్యక్రమంతో ధనుర్మాస ఉత్సవాలకు అర్చకులు ముగింపు పలికారు. డిసెంబర్ 16న ప్రత్యేక పూజలతో మొదలైన ధనుర్మాస ఉత్సవాలు.. జనవరి 14 వరకు వైభవంగా నిర్వహించారు. మంగళవారం చేపట్టిన అమ్మవారికి 'ఒడిబియ్యం' సమర్పణ కార్యక్రమంతో ఉత్సవాలు ముగిసినట్లు అర్చకులు తెలిపారు.






# తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలి


**యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని సంబంధిత ఆఫీసర్లను యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. బుధవారం యాదగిరిగుట్ట, రాజాపేట, ఆలేరు తహశీల్దార్ కార్యాలయాలను సందర్శించి రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విధినిర్వహణలో అధికారులు నిబద్ధతతో పని చేయాలన్న కలెక్టర్.. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని ఆదేశించారు. వీలైనంత తొందరగా డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట డిప్యూటీ తహశీల్దార్ మిర్యాల నరసింహరావు, ఆర్ఐలు విజయసింహారెడ్డి, శ్రీకాంత్, ఎంపీవో సలీం, సర్వేయర్ దేవా నాయక్ తదితరులు ఉన్నారు.



# పతంగి ఎగరేస్తూ బిల్డింగ్ పైనుండి పడి వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. పతంగి ఎగరేస్తూ ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుండి పడి వ్యక్తి స్పాట్ లోనే చనిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. అమ్మనబోలు గ్రామానికి చెందిన జూపల్లి నరేందర్(48) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా.. మధ్యాహ్నం తన బిల్డింగ్ పైనుండి పతంగి ఎగరేస్తూ ఫ్యామిలీతో సంబరాలు చేసుకున్నాడు. అనంతరం పక్కనే ఉన్న తన సొంత అన్నకు చెందిన బిల్డింగ్ ఎక్కి పతంగి ఎగరేస్తూ.. ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుండి పడి అక్కడికక్కడే చనిపోయాడు. ప్రాణం ఉందేమోనన్న ఆశతో కుటుంబ సభ్యులు హాస్పిటల్ కు తరలించగా.. స్పాట్ లోనే చనిపోయాడని డాక్టర్లు నిర్ధారించినట్లు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. బిల్డింగ్ పైన చుట్టూ రేలింగ్ లేకపోవడంతో.. పతంగి ఎగరేస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడి స్పాట్ లోనే చనిపోయాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య జూపల్లి మమత విజ్ఞప్తి మేరకు ఘటనపై కేసు నమోదు చేయలేదని, పోస్టుమార్టం చేయకుండానే మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని పోలీసులు వెల్లడించారు.

**మాంజా దారం తగిలి వృద్ధదంపతులకు గాయాలు**

యాదగిరిగుట్ట నరసింహస్వామి దర్శనం కోసం వచ్చిన హైదరాబాద్ కీసరుకు చెందిన వృద్ధదంపతులకు రోడ్డుకు అడ్డంగా ఉన్న మాంజా దారం తగిలి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ జిల్లా కీసర మండలం గోదుమకుంట గ్రామానికి చెందిన నారాయణ, వీరమణి అనే వృద్ధదంపతులు స్వామివారి దర్శనం కోసం జూపిటర్ స్కూటీపై యాదగిరిగుట్టకు వచ్చారు. మున్సిపల్ ఆఫీస్ సమీపంలో రోడ్డు అడ్డంగా ఉన్న మాంజా దారం ఉండడంతో.. స్కూటీ నడుపుతున్న భర్త నారాయణ సడెన్ బ్రేక్ వేశాడు. మాంజా దారం తగిలి నారాయణ గొంతుకు స్వల్ప గాయం కాగా.. వెనకాల కూర్చున్న భార్య వీరమణి కిందపడి తలకు గాయమైంది. హుటాహుటిన 108 వాహనంలో భువనగిరి ఏరియా హాస్పిటల్ కు తరలించి ట్రీట్మెంట్ అందించారు. ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పడంతో.. వృద్ధదంపతులు తమ వాహనంపై సొంత గ్రామం కీసరకు వెళ్లిపోయారని పోలీసులు తెలిపారు.

